ప్రజాశక్తి

భాషా వాలంటీర్ల కొనసాగింపునకు బడ్జెట్

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన ప్రాంత పాఠశాలల్లో స్థానిక భాష మాట్లాడే వాలంటీర్లను కొనసాగించాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకర్రావు ప్రభుత్వాన్ని అభ్యర్థించిన మేరకు వారిని కొనసాగిస్తూ బడ్జెట్ విడుదల చేసింది. ఇటీవల వివిధ ప్రాంతాల్లో చైర్మన్ పర్యటించినప్పుడు ఆయా భాషా వాలంటీర్లు (సవర, గదబ, సుగాలీ, చెంచు) వేతనం లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రస్తావించారు. వెంటనే స్పందించిన కమిషన్ చైర్మన్ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు రాగా సోమవారం అన్ని ఐటిడిఎల పరిధిలో ఆయా భాషా బోధకుల్ని నియమిస్తూ, బడ్జెట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ గిరిజన భాషలు వృద్ధి కొనసాగించాలన్నారు. ఈ విషయం తెలుసుకున్న గిరిజన నాయకులు, భాషా వాలంటీర్లు చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రేడియాలజిస్టు లేక అవస్థలు

ప్రయివేట్ ల్యాబ్‌లకు రోగుల పరుగులు

ప్రజాశక్తి - పాలకొండ

పేదలకు మెరుగైన వైద్యసేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెబుతున్న పాలకులు, అధికారులు ఆచరణలో అంతా శూన్యమేనన్న వాస్తవాలు సర్కారు దావాఖానాల్లో దర్శనమిస్తున్నాయి. ప్రజలకు వద్దకు వైద్యసేవలని చెబుతున్న పాలకులు ప్రభుత్వ వైద్యశాలల్లో కనీస సౌకర్యాలు ఉన్నాయో లేదానని గమనించకపోవడం విడ్డూరం. పేరుకే పెద్దాసుపత్రులు తప్ప అక్కడ సేవలు మాత్రం సున్నా అన్నందుకు నిదర్శనం స్థానిక ఏరియా ఆసుపత్రే.

రేడియాలజిస్టు లేకపోవడంతో మూతపడ్డ స్కానింగ్ గది

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పేరుకు వంద పడకల ఆసుపత్రి అయినప్పటికీ సమస్యలు మాత్రం కోకొల్లలు. ఏజెన్సీకి ముఖద్వారం దగ్గరున్న ఆసుపత్రికి నిత్యం రోగులు అధిక సంఖ్యలో వచ్చిపోతున్నారు. ఈ ఆసుపత్రికి పాలకొండతో పాటు విజయనగరం జిల్లా నుంచి రేగిడి, శ్రీకాకుళం జిల్లా నుంచి బూర్జతో పాటు సీతంపేట, భామిని, వీరఘట్టం, కొత్తూరు మండలాలకు చెందిన రోగులు ఇక్కడికి అధిక సంఖ్యలు వస్తున్నారు. ఆ ఆసుపత్రికి రోజుకు సుమారు 200 నుండి 250 వరకు అవుట్ పేషంట్లు రాగా, ఇన్ పేషంట్లు 50 నుంచి వంద మంది వరకు ఉంటున్నారు. ముఖ్యంగా గర్భిణులతో పాటు జనరల్ ఆపరేషన్లకు సంబంధించి రోగులు ఇక్కడకు ఎక్కువ మంది వస్తున్నారు. అయితే ప్రతి ఆపరేషన్‌కు, ఇతర రోగాలను గుర్తించేందుకు ప్రధామైంది స్కానింగ్. అయితే ఇందుకు సంబంధించిన రేడియాలజిస్టు లేకపోవడంతో స్కానింగ్ కోసం ప్రైవేటు ల్యాబ్‌లకు పరుగులు తీస్తున్నారు. ఇక్కడ పరికరాలున్నప్పటికీ సంబంధిత వైద్యులు కొద్ది రోజులుగా లేరు. గతంలో పని చేసిన వైద్యులు రాజేష్ రాజీనామా చేసి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఇక్కడ రేడియాలజిస్టు లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పటం లేదు. ఇప్పటికైనా రెగ్యులర్ రేడియాలజిస్టును నియమించాలని పలువురు కోరుతున్నారు.

వినతులను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని జాయింటు కలెక్టరు ఆర్. గోవిందరావు తెలిపారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జెసితో పాటు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, డిఆర్‌ఒ జె.వెంకటరావుతో కలిసి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజల నుండి వచ్చిన వినతుల పరిష్కారానికై సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని తెలిపారు. మండల, గ్రామ స్థాయిలోని సమస్యలకు అక్కడే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మక్కువ మండలం డి-శిర్లాం గ్రామానికి చెందిన చెల్లారపు నారాయణకు రూ.3,500 విలువ చేసే వినికిడియంత్రాన్ని జాయింటు కలెక్టరు అందజేశారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 126 వినతులను ప్రజలు సామాజిక, వ్యక్తిగత సమస్యలపై అందజేశారు. స్వీకరించిన దరఖాస్తులు కొన్ని...

పార్వతీపురం నుంచి వీరఘట్టం రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయని, అందువల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ రహదారికి ఇరువైపుల రోడ్డుపై ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని టిడిపి గరుగుబిల్లి మండల అధ్యక్షులు అక్కేన మధుసూదనరావు కోరారు. పాచిపెంట మండలం ఈతమానువలసలో తుపాను ప్రభావం వల్ల వంట గదులు కూలిపోయాయని, గ్రామానికి రక్షణ గోడను మంజూరు చేయాలని గ్రామస్తులు, సర్పంచ్ కె.బాబూరావు వినతిని అందజేశారు. పార్వతీపురం పట్టణం అమ్మిగారి కోనేరు గట్టు వీధి నాలుగో వార్డులో ప్రభుత్వం అందించే రేషన్ సరిగ్గా అందడం లేదని, రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలని పి.గౌరి, డి.భారతి దరఖాస్తు అందజేశారు. బలిజిపేట మండలం అరసాడకు ఎ.సునీత వైఎస్ఆర్ కల్యాణమస్తు కానుక మంజూరు చేయాలని కోరారు. సాలూరుకు చెందిన ఎం.జగదీశ్వరరావు సర్వేనెంబర్ 360 లో 80 సెంట్లు భూమి ఆన్లైన్లో వేరే వారి పేరున చూపిస్తుందని, రీ సర్వే జరిపించి తన భూమిని తనకు అప్పజెప్పాలని వినతిని అందజేశారు. గరుగుబిల్లి మండలం చినగుడబకు చెందిన జి.గంగమ్మ సర్వే నంబర్ 80లో గల మెట్టు భూమిని 30 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నామని, ఆ భూమికి రీ సర్వే జరిపించి పాస్ బుక్ మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. పాచిపెంట మండలం గుంట మామిడి వలస గ్రామానికి చెందిన సి.హెచ్ లక్ష్మణ రావు కిరాణా షాప్ కొరకు పిటిజి లోన్ మంజూరు చేయాలని కోరారు. కొమరాడకు చెందిన ఎస్.ఉదయ్ శేఖర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రంగు మారినా గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని అర్జీ అందజేశారు. వీరఘట్టం మండలం తెట్టంగికి చెందిన జి.సింహాచలం రైస్ కార్డులో తన పేరును యాడ్ చేయాలని దరఖాస్తు అందజేశారు. ఐటిడిఎ పరిధిలోని ఎపిటిడబ్ల్యూఆర్ఇఐఎస్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలల్లో సెక్యూరిటీ సిబ్బంది ని విధుల్లో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని గిరిజన సేవా సంఘం అధ్యక్షులు మంచాల ఈశ్వరరావు,ఇతరులు దరఖాస్తు అందజేశారు. లికొమరాడ మండలం రామభద్రపురం గ్రామానికి చెందిన మురళీకృష్ణ పార్వతీపురం - రాయగడ జాతీయ రహదారి పక్కన రామభద్రపురం గ్రామానికి ఆనుకొని ఉన్న చెట్టును తొలగించాలని వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

తుపాను నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలోని మిచౌంగ్ తుపాను నష్టం పరిహారానికి నిధులు కేటాయించాలని, రైతులకు నిబంధనలు సడలించి తడిసిన, రంగుమారిన, మొలకెత్తిన ధాన్యం పూర్తిగా కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్ కు సిపిఎం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ జిల్లాలో మిచౌంగ్ తుఫాన్ వల్ల వరి పంట నీట మునిగి తడిసి ముద్దయిందన్నారు. రైతులు వేసిన మినుము,పెసర అపరాలు, పత్తి, మొక్కజొన్న, కూరగాయలు తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని మండలాల్లో సిపిఎం పర్యటించిందని, జిల్లాలో తీవ్ర నష్టం జరిగినట్టు గుర్తించిందని, ప్రభుత్వం పరిశీలించి పంట నష్టం అంచనా వేసి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.మన్మథరావు, జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ, పట్టణ నాయకులు బంకురు సూరిబాబు ఉన్నారు.

జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెసి, ఐటిడిఎ పిఒ, డిఆర్‌ఒ, అధికారులు

15న పార్వతీపురంలో జాబ్‌మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం

పార్వతీపురంలో జాబ్ మేళాను ఈ నెల 15న నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్ గోవింద రావు తెలిపారు. ఈ మేరకు సోమవారం జాబ్ మేళా పోస్టర్‌ను విడుదల చేశారు. ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా పార్వతీపురంలో గాయత్రి డిగ్రీ కాలేజీలో ఈనెల 15న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జాబ్ మేళాలో 16 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారని, ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బిటెక్, ఎంబిఎ చదివిన అభ్యర్థులు అర్హులని వారు తమ వివరాలను skilluniverse.apssdc.in వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని జాయింట్ కలెక్టరు గోవింద రావు తెలిపారు. మరిన్న వివరాల కోసం 6305110947, 6303493720 నంబర్లును సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, డిఆర్‌ఒ జె.వెంకట రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాథరావు, జిల్లా పరిశ్రమల అధికారి ఎంవి కరుణాకర్, నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయి కుమార్, నైపుణ్య అభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి- సాలూరు

ఈ నెల 15నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ సిఎం రాజన్నదొర కోరారు. సోమవారం రాజన్నదొర నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా సామగ్రిని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, బాడ్మింటన్ క్రీడలకు సంబంధించిన సామగ్రిని సచివాలయాల వారీగా పంపిణీ చేయాలని ఆదేశించారు. మొత్తం 2262 మంది క్రీడల్లో పాల్గొనడానికి పేర్లు నమోదు చేసుకొన్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతులు వుంటాయని చెప్పారు. నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన వారికి జిల్లా స్థాయిలో, అక్కడ విజేతగా నిలిచిన వారికి రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని చెప్పారు. క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు. యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్ లు గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు, మున్సిపల్ కమిషనర్ జయరాం, వైసిపి నాయకులు సింగారపు సింహాచలం పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పరికరాలను అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ఆడుదాం ఆంధ్ర మెటీరియల్ పంపిణీ

సీతంపేట : మండలంలో 31 సచివాలయాల సిబ్బందికి సోమవారం వైటిసిలో డిడిఒ వివి గోపాలకృష్ణ, ఎంపిపి బి. ఆదినారాయణ చేతుల మీదుగా ఆడుదాం ఆంధ్రా మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఆడుదాం ఆంధ్ర రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తిచేసి గ్రామాల్లో క్రీడలు నిర్వహించి ఎంపికలు నిర్వహించాలన్నారు. జనవరి వరకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ గీతాంజలి, వైసిపి నాయకులు ఎస్ రాము, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇంచార్జ్ ఎన్ జాకబ్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

దూరప్రాంతాలకు డొక్కు బస్సులా?

ఆర్‌టిసి అధికారుల తీరుపై ఫిర్యాదు చేస్తా: డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ఆర్టీసీ డిపోలో డొక్కు బస్సులు దూరప్రాంతాలకు నడుపుతూ బాగున్న బస్సులను వేరే డిపోలకు తరలిస్తున్నారని ఫిర్యాదులొచ్చాయని, త్వరలో ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని డిప్యూటీ సిఎం రాజన్నదొర చెప్పారు. సోమవారం పట్టణానికి చెందిన వైసిపి నాయకులు, కౌన్సిలర్లు రాజన్నదొరను కలిసి ఈ విషయంపై వినతిపత్రం అందజేశారు. డిపోలో మంచి కండిషన్‌లో ఉన్న బస్సులను దూరప్రాంతాలకు నడపకుండా డొక్కు బస్సులు నడపడంపై తనకు ఫిర్యాదులు అందాయని చెప్పారు. దీనిపై స్థానిక డిపో మేనేజర్, డివిజనల్ మేనేజర్లను వివరణ కోరతామని చెప్పారు. గతంలోనూ డిపోను ఎత్తివేయాలని ప్రయత్నిస్తే అడ్డుకున్నామని చెప్పారు. విజయవాడ, విశాఖపట్నం, రావులపాలెం వంటి దూరప్రాంతాలకు డొక్కు బస్సులు నడుపుతున్నారనే ఫిర్యాదులు అందాయని చెప్పారు. దీనిపై అవసరమైతే రవాణా శాఖ మంత్రి పినిపె విశ్వరూప్‌తో మాట్లాడతానని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరతానని చెప్పారు. సుఖం, సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా పని చేస్తున్న ఆర్టీసీలో ఇలాంటి విధానాల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా దూరప్రాంతాలకు కండిషన్‌లో ఉన్న బస్సులను నడిపేలా చర్యలు తీసుకుంటామని రాజన్నదొర చెప్పారు. డిప్యూటీ సిఎంకు ఫిర్యాదు చేసిన వారిలో పట్టణ వైసిపి అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు, వైసిపి నాయకులు పి.అప్పలస్వామి, హరి బాలాజీ, ఎస్.సింహాచలం వున్నారు.

సత్యాగ్రహ దీక్షనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

అగ్రిగోల్డ్ బాధితుల సత్యాగ్రహ దీక్ష

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అగ్రిగోల్డ్ ఆస్తులు అమ్మయినా బాధితులకు చెల్లింపులు చేపట్టాలని సిపిఎం, సిపిఐ, తెలుగుదేశం, జనసేన, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన సత్యాగ్రహ దీక్షను జిల్లా అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈదీక్షలో ముఖ్య అతిథిగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఈవి నాయుడు పాల్గొన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు రెడ్డి వేణు, కూరంగి మన్మథరావు, ఎఐటియుసి ఉమ్మడి జిల్లా కార్యదర్శి బుగత అశోక్, టిడిపి సీనియర్ నాయకులు బార్నాల సీతారాం, పొట్నూరు వెంకట నాయుడు, జననసేన నాయకులు వంగల దాలినాయుడు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కన్వీనర్ పి. సంగం, సిఐటియు జిల్లా కార్యదర్శి యమ్మల మన్మథరావులు దీక్షా శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018 మార్చిలో నాటి ప్రతిపక్ష నాయకునిగా నేటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అగ్రిగోల్డ్ బాధితుల దీక్షల శిబిరానికి వచ్చి మన ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లో రూ.20 వేలలోపు బాధితులకు రూ.1180 కోట్లను చెల్లిస్తానని, 6నెలల్లో బాధితులందరికీ పూర్తి న్యాయం చేస్తానని, యాజమాన్యం సంగతి తాను చూసుకుంటానని, కోర్టు బాధ్యత తనదేనని హామీ ఇచ్చారన్నారు. తీరా గెలిచిన ముఖ్యమంత్రి రూ.10వేలు, రూ.20వేలు లోపు ముఖ్యమంత్రి 10వేలు, రూ.20వేలు లోపు బాధితులకు కొంతమందికి మాత్రమే రూ.906 కోట్లు మాత్రమే చెల్లింపులు చేశారని, ఇంకా రూ.3050 కోట్లు ఇవ్వాలని కోరారు. అగ్రిగోల్డ్ బాధితుల సొమ్ముతో కొన్ని వేల కోట్ల విలువ చేసే భూములు ఇప్పుడు సిఐడి చేతిలో అటాచ్ చేయబడి ఉన్నాయని, పై ఆస్తులను ప్రభుత్వం వారు ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకొని లేదా ఆస్తులను వేలం వేసైనా బాధితులకు పూర్తి చెల్లింపులు చేపట్టాలని అన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవటానికి ఇంకా 2 నెలలు సమయం మాత్రమే ఉన్నాయని బాధితులకు పూర్తి న్యాయం చేయకపోతే గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సాలాపు అనంతరావు, నాయకులు ఆర్.ఆదినారాయణ, ఆర్. మురళీ డాక్టర్, సాయిరాం, బి. వెంకటరమణ, (చిరు) బిటిఆర్ నాయుడు, బి. బంగారి, రామారావు మహారాణా, వెల్లంకి గోవింద, శ్రీను, సొండి గౌరిశంకరరావు, పాల్తేరు శ్రీను అధిక సంఖ్యలో బాధితులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పార్వతీపురం

కొత్తగా లా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువ న్యాయవాదులు వృత్తిలో నిలదొక్కుకొని ఉన్నతంగా ఎదిగేలా ప్రభుత్వం లా నేస్తం పథకం కింద నెలకు రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించి భరోసా కల్పిస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి గూడెం క్యాంప్ కార్యాలయం నుంచి వైఎస్ఆర్ లా నేస్తం పథకం కింద బటన్ నొక్కి నేరుగా ఆర్థిక సాయాన్ని న్యాయవాదుల ఖాతాలకు విడుదల చేశారు. స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం నుండి జిల్లా ఇంఛార్జి కలెక్టర్ ఆర్.గోవిందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవృత్తిలో ప్రాక్టీస్ పరంగా స్థిరపడేందుకు ఏడాదికి రూ.60 వేలు చొప్పున రెండుదఫాలుగా ప్రభుత్వం చెల్లిస్తూ మూడేళ్లకు రూ.1.80 లక్షల ఆర్థిక తోడ్పాటును అందిస్తుందన్నారు. జిల్లాలోని 12మంది న్యాయవాదులకు రూ.3.60 లక్షల సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా యువ న్యాయవాదులకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్ర రావు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం నాయకులపై కేసులను రద్దు చేయాలి

ప్రజాశక్తి కలెక్టరేట్

రైతులు, రైతు సంఘాల నాయకులపై ఉన్న కేసులను రద్దు చేయాలని సంయుక్త కిసాన్ మార్చ కన్వీనర్ బంటు దాసు, రైతు సంఘం నాయకులు బొత్స నరసింహరావు సోమవారం గ్రీవెన్స్‌లో డిఆర్‌ఒ జె.వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ రంగంలో నల్ల చట్టాలను రద్దు చేయాలని గతంలో ఎంతో మంది రైతులు, రైతుసంఘం నాయకులు పోరాటాలు చేసినప్పుడు కేంద్ర ప్రభుత్వం రైతు నల్ల చట్టాలను రద్దు చేస్తూ రైతు సంఘం నాయకులపైనా రైతులపై ఉన్న కేసులను రద్దు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హామీ ఇచ్చినప్పటికీ నేటికీ కొన్నిచోట్ల కేసులను రద్దు చేయకుండా రైతు సంఘం నాయకులను అరెస్టు చేస్తున్నారన్నారు. కావున ఇటువంటి అరెస్టులను ఖండించాలని డిమాండ్ చేశారు.

తక్షణమే సమస్యలు పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రతి సోమవారం ఎస్పీ కార్యాలయానికి వచ్చిన అర్జీదారుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలి కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ నేరుగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. వేధింపులు, కుటుంబ కలహాలు, సివిల్ తగాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని, స్పందనలో ఫిర్యాదు చేసిన వ్యక్తి పదే పదే పోలీసు స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉండకూడదని, బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో 13 ఫిర్యాదులు అందాయి. జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలు వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని, వాటిపై చట్టపరిధిలో విచారణ జరిపి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని ఎస్‌పి తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్, ఎస్బి సిఐ సిహెచ్. లక్ష్మణరావు, డిసిఆర్‌బి సిఐ ఎన్‌వి ప్రభాకర్రావు, ఎస్‌ఐ పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : ఎంపిడిఒకు వినతిని అందజేస్తున్న గ్రీన్ అబబాసిడర్లు

గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - సీతానగరం

గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించాలని సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, గ్రీన్ అంబాసిడర్ యూనియన్ నాయకులు ఎం.గౌరి సోమవారం స్థానిక ఎంపిడిఒ ఎంవిఎస్ఎన్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 నెలలు కావస్తున్నా సక్రమంగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. పంచాయతీల్లో అన్ని పనులు సర్పంచులు చేయించుకుంటున్నారని, పూడికతీతల తో పాటు ఏ ఒక్క పని అయినా చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వలె సర్పంచులకు కాకుండా నేరుగా తమ అకౌంట్లో జీతాలు చెల్లించాలని, పెండింగ్ జీతాలు ఇప్పించాల్సిందిగా కోరారు. వినతిని అందజేసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, గ్రీన్ అంబాసిడర్ల యూనియన్ సభ్యులు సిహెచ్ శివున్నాయుడు, తిరుపతిరావు, సింహాచలం, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలో వివిధ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు ఏడాది పొడవున బకాయి జీతాలు చెల్లించలేదని ఆ సంఘ మండల అధ్యక్షులు ఎం.పైడయ్య ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు చెల్లించాలని కోరుతూ స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఇఒపిఆర్డి జగదీష్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జీతాలను నేరుగా ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్న విధంగా అలవెన్స్ జీతాలు పెంపు, గుర్తింపు కార్డులు ,గ్రూప్ ఇన్సూరెన్స్, పదివేలు పెన్షన్ , యూనిఫారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె. గౌరీశ్వరరావు, పలువురు పారిశుధ్య కార్మికులు ఉన్నారు.

కరాటేలో గిరిజన విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మండలంలోని పెదమరికి ఎంపియుపి పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న హిమరక నాని ఎపి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు నిర్వహించిన కరాటే పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపించి ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి కరాటే పోటీలకు అర్హత సాధించినట్లు కోచ్ ఎస్.నాగేశ్వరరావు, చీఫ్ కోచ్ జి.గోపాల్ తెలిపారు. ఈ మేరకు నానిని డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్, డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు, ఎస్‌జిఎఫ్ జిల్లా సెక్రెటరీ డిటి గాంధీ శాలువాతో పూలమాలలు వేసి సన్మానించారు.

మినీ అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయండి

ప్రజాశక్తి- సీతంపేట

రామానగరం, పెద్దగూడలో చిన్నారులు ఉన్నారని మినీ అంగన్వాడి కేంద్రం మంజూరు చేయాలని ధారపాడు సర్పంచ్ జి సుందరమ్మ, సిపిఎం మండల కార్యదర్శి ఏ భాస్కరరావు, గిరిజన సంఘం నాయకులు జి. శ్రీరాములు పిఒ కల్పన కుమారికి సోమవారం స్పందన కార్యక్రమంలో వినతినిచ్చారు. సవర సింగిపురం గ్రామినికి చెందిన రవి వాటర్ ట్యాంక్ మంజూరు చేయాలని, శ్యామలమ్మ వైయస్సార్ కళ్యాణమస్తు పథకం మంజూరు చేయాలని, ఎగువ గోడకి చెందిన కోతమ్మ నాటు కోళ్ల పథకం మంజూరు చేయాలని, కిరపకు చెందిన అనిత జిఎన్ఎం కోర్స్ చదువుకోవడానికి ఆర్థిక సహాయం అందించాలని, జానీ గోడకు ఆఫీస్ కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని పిఒ దృష్టికి తీసుకొచ్చారు. జనగాల పాడుకు చెందిన చుక్కయ్య ఆటో లోను మంజూరు చేయాలని, జమ్ముడు గూడకు చెందిన కళ్యాణరావు బీటి రోడ్డు పూర్తి చేయాలని, కుండికి చెందిన రామారావు దుక్కి దున్నే మిషన్ మంజూరు చేయాలని, కాశిమాను గూడకు చెందిన బుడ్డయ్య పంట నష్టపరిహారం మంజూరు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ రోషి రెడ్డి, డ్రైవర్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి సింహాచలం, పిఎఒ హరికృష్ణ డిప్యూటీ డిఎంహెచ్ఒ కె. విజయ పార్వతి, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, సిడిపిఒ పి. రంగలక్ష్మి పాల్గొన్నారు.

సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పిఒ కల్పన కుమారి

రోడ్డు ప్రమాదాలపై దృష్టి పెట్టండి

పార్వతీపురం టౌన్: జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించాలని జనసేన పార్టీ నాయకులు, ఎన్‌హెచ్ఆర్‌సి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జెసి ఆర్.గోవిందరావుని కలిసి జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై చర్చించారు. జిల్లాలో కొన్ని బ్లాక్ స్పాట్ల వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా అడ్డాపుశీల గ్రామ సమీపంలో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, సీతానగరం, కొమరాడ తదితర మండలాలతో పాటు పార్వతీపురం పట్టణంలోని బైపాస్ రోడ్డు, టౌన్ ఫ్లై ఓవర్, మెయిన్ రోడ్డు, ఆర్‌టిసి కాంప్లెక్స్ జంక్షన్, వైకెయం కాలనీ, వెంకంపేట గోళీలు, నర్సిపురం తదితర ప్రాంతాల్లో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆయా రోడ్డు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా, పలువురు అంగవైకల్యంతో బాధపడుతున్నారని గుర్తు చేశారు. రోడ్డు ప్రమాదానికి గురైన బాధితుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. పూటుగా మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్లు వాహనాలు నడపడం, అధికలోడు, మితిమీరిన వేగంతో లారీలు, ఆటోలు తదితర వాహనాలు నడుపుతుండడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు వివరించారు. ఆటోలు, లారీలు ద్వారా ప్రమాదాలు జరగకుండా నియంత్రించాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నారు. నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న స్థలాల వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి, సంబంధిత శాఖ అధికారుల నిఘా పెంచడం ద్వారా రోడ్డు ప్రమాదాలు నివారించి ప్రజల ప్రాణాలను రక్షించాలని కోరుతూ, వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన జెసి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.

సామాజిక భద్రత కల్పించాలి

పాలకొండ: సామాజిక భద్రతను కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు అన్నారు. సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సామాజిక పెన్షన్లను కనీసం రూ.10వేలు పెంచడానికి అవసరమైన నిధుల సేకరణకు కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంపన్నులపై సేకరించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ఏ ప్రభుత్వం వచ్చినా ఈ విధంగా అమలు చేసి సామాజిక పెన్షన్లు దరిద్ర్యరేఖ దిగువనున్న వారికే కాకుండా శ్రామికులంతా వృద్ధాప్యంలో పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదాయ పరిమితి పేరుతో కుటుంబంలో సభ్యులుగా ఉండి ఇతర వృత్తులు చేసుకున్న వారిని అర్హులుగా గుర్తించకపోవడం సరికాదన్నారు. వ్యవసాయ, అసంఘటిత కార్మికులతో పాటు రైతులు సమస్యలతో ఎదుర్కొంటున్నారని వారిని ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు డయుల్ యువర్ డిఎం

పాలకొండ: డయల్ యువర్ డిఎం కార్యక్రమం మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు చేపడుతున్నట్లు డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రయాణికులు ఎటువంటి సమస్యలున్నా 9959225057కు ఫోన్ ద్వారా తెలియజేయాలని కోరారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు అయినట్లు ప్రధానోపాధ్యాయులు ఉప్పాడ అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరంలో ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ -17 ఫెన్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాఠశాలకు చెందిన 8, 9 తరగతిల విద్యార్థులు పి.గోవిందు, ఎస్.పావనీలు ఉత్తమ ప్రతిభ కనబర్చి రజత పతకాలు సాధించారు. అంతేకాక జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 15న గుజరాత్‌లో జరుగు జాతీయ స్థాయి పోటీలకు వీరు హాజరుకానున్నట్లు ఆయన చెప్పారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.రామకృష్ణ, వై ధనలక్ష్మి, సర్పంచ్ సిహెచ్ మధుసూధన రావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు, అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎస్ఐ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఎస్ఐగా వి.షణ్ముఖరావు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణిని చినమేరంగిలో ఆమె అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలతో ఫ్రెండ్లీ పోలీస్‌గా ఉండి విధులు నిర్వహిస్తానని తనకు ప్రజాప్రతినిధులు, ప్రజలు, పాత్రికేయ మిత్రులు సహకరించాలని కోరారు.

ప్రకృతి పంటలతో ఆరోగ్యానికి రక్ష

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎటువంటి రసాయినిక ఎరువుల్లేని ప్రకృతి వ్యవసాయ పంటలను వినియోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎంపిపి కె.దీనమయ్య కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఆవరణంలో రైతు సాధికార సంస్థ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రం ఏర్పాటు చేశారు. చిరుధాన్యాలతో చేసే తినుబండారాలు, ప్రకృతి పద్ధతుల్లో పండించే కూరగాయలను ప్రదర్శనగా ఉంచారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో రసాయన ఎరువులతో పండించిన పంటలను తినడం వల్ల ప్రజలు కేన్సర్, బిపి, షుగర్ వంటి రకరకాల వ్యాధుల బారినపడి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి మన ఇంటి పరిసరాల్లో, పొలాల్లో ప్రకృతి వ్యవసాయ సాగు చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి జగదీష్ కుమార్, మోడల్ మండల టీం సభ్యులు వై.గణేష్, శరత్‌చంద్ర, ఎంటిలు స్వామినాయుడు, నిర్మల, కె.భూషణ, మిన్నారావు, సత్యవతి, గౌరి పాల్గొన్నారు.

ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా అధికారులు ధాన్యం కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు గురాన శ్రీరామ్మూర్తి కోరారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా కాకుండా మిల్లర్లకు ధాన్యాన్ని పంపిస్తే తూకంలో తేడాలొచ్చి రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. గత ఏడాది కూడా అధికారులు రైతులు పండించే పంటను మిల్లర్లకు అప్పజెప్పడంతో తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇదే కొనసాగితే ప్రభుత్వం దళారీ వ్యవస్థను ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు. ఇప్పటికే కరువు ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పంట నష్టంపై సర్వే చేసి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది గోనె సంచులు రైతులకు కొత్తవి పంపిణీ చేయాలని కోరారు.

మరింత చేరువగా సేవలందించాలి

ప్రజాశక్తి - మక్కువ

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రజలకు మరింత చేరువై సేవలు అందించాలని జెడ్‌పిటిసి సభ్యులు ఎం.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఎపి ఎస్ఐఆర్‌డిపిఆర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగుల శిక్షణా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రభుత్వ నిబంధనలకు లోబడి విధి నిర్వహణలో అంతా సక్రమంగా పనిచేశారని ఇకపై ఈ ఐదు రోజుల శిక్షణ సద్వినియోగం చేసుకొని మరెన్నో మెలకువలు అలవర్చుకొని ప్రజలకు సేవలు అందించాలన్నారు. ప్రస్తుత శిక్షణ ద్వారా మేధస్సును పెంపొందించుకొని ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు రంగనాయుడు, ఎంపిడిఒ సూర్యనారాయణ, ప్రత్యేక అధికారి దేవకుమార్, అన్ని పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పనుకువలస పంచాయతీ చీపురువలస సమీపాన గల పారమ్మ కొండపై సోమవారం శివపార్వతుల కల్యాణం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి హాజరయ్యారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో ఈ ప్రాంత ఆరాధ దైవం పారమ్మ తల్లి కావడంతో పారమ్మ కొండపై ప్రతి ఏడాది శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కల్యాణానికి తెల్లవారుజాము నుంచే సాలూరు పట్టణం పాచిపెంట మండలం నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరై వేద పండితుల మంత్రోత్సవ నడుమ అంగరంగ వైభవంగా జరిగిన కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని భక్తులు తిలకించారు. కల్యాణానికి హాజరైన సుమారు 18వేల మందికి అన్న సమరాధనా నిర్వహించారు. కార్యక్రమంలో పారమ్మ కొండ ట్రస్ట్ బోర్డు సభ్యులు సర్పంచ్ చెల్లూరి సీతారామకష్ణ పాల్గొన్నారు.

రెగ్యులర్ డిడిని నియమించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

పార్వతీపురం ఐటిడిఎకు రెగ్యులర్ డిప్యూటీ డైరెక్టర్‌ను నియమించాలని పలు గిరిజన సంఘాల నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు, పల్ల సురేష్, చుక్క మహేష్, చెల్లూరు సీతారాం తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో అనేక సమస్యలు పరిష్కారం కాక అనేక ఏళ్లుగా గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గిరిజన విద్యా వ్యవస్థ సక్రమంగా నిర్వహించేందుకు తక్షణమే రెగ్యులర్ డిడిని నియమించాలని డిమాండ్ చేశారు. అలాగే ఐటిడిఎలో జరిగిన అక్రమ డెప్యుటేషన్లను రద్దు చేయాలని, గిరిజన విద్యా సంస్థల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని కోరారు. అలాగే కొమరాడ మండలం సర్వాపాడు-లడ్డ రోడ్డు సహా అనేక గిరిజన గ్రామాలకు రోడ్లు వేయాలని, గిరిజన గురుకులాల్లో పనిచేసిన సెక్యూరిటీ సిబ్బంది అందరినీ విధుల్లోకి తీసుకోవాలని కోరారు. జిల్లాలో జరుగుతున్న కులగణన కార్యక్రమంలో అన్ని గిరిజన సంఘాలను భాగస్వామ్యం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్‌కు వినతిని అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన నిరుద్యోగ సంక్షేమ సంఘం, గిరిజన విద్యార్థి సంఘాల (జిఎస్‌యు, టిఎస్ఎఫ్) నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

లారీ ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన సోమవార చోటు చేసుకుంది. రూరల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జి.జయరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండలం సింగనాపురం గ్రామానికి చెందిన లచ్చిపతుల పోలమ్మ (39) తన భర్త శంకరరావుతో కలిసి పార్వతీపురం మండలం అడ్డాపుశీలలోని శివాలయం దర్శనం చేసుకుని ప్రధాన రహదారి రోడ్డు పక్కన నిలబడి ఉన్నారు. ఆ సమయంలో వీరఘట్టం నుండి పార్వతీపురం వైపు వస్తున్న లారీ బలంగా ఢీ కొట్టింది. ఈ సంఘటనలో పోలమ్మకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు తనిఖీ చేయగా, అప్పటికే ఆమె మృతి చెందిందని తెలిపారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శివాలయంలో హుండీ చోరీ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని నర్సిపురంలో రైల్వే స్టేషన్ సమీపాన కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో చోరీ జరిగింది. ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు హుండీ చోరీ చేశారు. సోమవారం ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులు తాళం పగలగొట్టి ఉండడాన్ని చూసి కమిటీ సభ్యులకు తెలిపారు. ఆలయం ప్రాంగణం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంది. ఈ విషయమై ఆలయ నిర్వహకులు రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

దళితులను అభివృద్ధి చేయాలి

డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

దళితులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర అధ్యక్షులు జెవి ప్రభాకర్ డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కన్వీనింగ్ సమావేశం స్థానిక ఎన్జీ హెూమ్ భవనంలో నాయకులు టి.జీవ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులను అభివృద్ధి చేయకుండా అడ్డుకుంటున్నారన్నారు. అలాగే దళితువాడలు పందుల దొడ్డిలా ఉన్నా పట్టించుకొనే నాధుడే లేడని ఆందోళన వ్యక్తం చేశారు. దళితులంతా ఐక్య పోరాటంతో ప్రభుత్వాల నుంచి తమ కోర్కెలను ఫలించుకోవాలన్నారు. ప్రభుత్వం రద్దు చేసిన పథకాలు వెంటనే పునరుద్ధరించాలని, ఎస్సీ కార్పొరేషన్ నిధులు వెంటనే విడుదల చేయాలి, ఉపాధిహామీ నిధులు రూ.2లక్షల కోట్లుకు పెంచాలని, ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాన్ని వెంటనే ఆపాలి, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ కల్పించాలని, గ్రామీణ ప్రాంత దళితులకు మూడు ఎకరాల భూమి చొప్పున పంచాలని, కుల నిర్మూలన కోసం పార్లమెంట్లో చట్టం చేయాలి, సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయాలి, దళిత యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని తదితర డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్తు ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు. అనంతరం దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విజయనగరం దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు గోక రమేష్, వసంత కుమార్, జిల్లా నాయకులు గరుగుబిల్లి సూరయ్య, పూల ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం : ఎంపిపి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం మహిళా శక్తి పథకం కింద ఆటోలు మంజూరు చేసిందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి ఉరిటి రామారావు అన్నారు. మండలంలోని శివ్వాం, వల్లరిగుడబకు చెందిన మహిళలకు మహిళాశక్తి పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన ఆటోలను సోమవారం స్థానిక ఐకెపి కార్యాలయం వద్ద ప్రా రంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ అర్హులైన ఎస్సీ, ఎస్టీ మహిళలకు కేవలం 10 శాతం వ్యయంతో వారు ఆటోలు సమకూర్చు కుని వాటి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేలా మహిళా శక్తి పథకం ద్వారా 90 శాతం రుణ సౌకర్యంతో ప్రభు త్వం మంజూరు చేసిందన్నారు. ఇందుకోసం సెర్ప్ పరిధిలోని "ఉన్నతి" కార్యక్రమంలో వడ్డీ లేని రుణాలను మంజూరు చేసిందన్నారు. ఈ"మహిళా శక్తి" ద్వారా స్వశక్తితో ఎదిగే మహిళల కోసం మహిళా సంఘాల సభ్యుల్లో డ్రైవింగ్‌లో నైపుణ్యం ఉండి ఆటోలు కొనుగోలు చేసుకొని స్వశక్తితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి మాట్లాడుతూ మహిళలు మరింత ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఉద్దేశంతో ప్రభుత్వం పలు పథకాలు అందజేస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.పైడితల్లి, ఎంపిటిసి సభ్యులు దేవాతి నారాయణమ్మ, ఎపిఎం పి.అప్పలనాయుడు, వైసిపి నాయకులు, సిసిలు పాల్గొన్నారు..

ఆటోలను ప్రారంభిస్తున్న ఎంపిపి ఉరిటి రామారావు

తాళ్లబురిడిలో 'వై ఎపి నీడ్స్ జగన్'

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మండలంలోని తాళ్లబురిడిలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం లక్షలాది రూపాయలతో అన్ని వర్గాలకు ప్రత్యక్షంగా అందేలా సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాకుండా, పంచాయితీల అభివృద్ధికి లక్షల వ్యయం చేసి అధునాతన భవనాలను నిర్మిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచి గుంట్రెడ్డి సతీష్ కుమార్, ఎంపిపి మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, వైస్ ఎంపిపి బి.రవి కుమార్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు బి.కృష్ణమూర్తి, ఎంపిపి ప్రతినిధి మజ్జి శేఖర్, స్థానిక సర్పంచ్ సంపంగి జగదీష్, మండల సీనియర్ నాయకులు, ఎంపిడిఒ, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు, పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మండలంలోని పెద బోర బందలో వై జగన్ ఏపీ నీడ్స్ అన్న కార్యక్రమంలో జరిగింది. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అభివృద్ధిని, పార్టీలకతీతంగా అమలు చేసిన సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డ్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు సువ్వాడ భరత్‌శ్రీను, పురోహితుని వలస సర్పంచ్ బంకురు తిరుపతి నాయుడు, ఎంపిడిఒ జి.పార్వతి, ఇఒపిఆర్‌డి, సచివాలయం, అంగన్వాడీ సిబ్బంది, వాలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

మక్కువ: ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం సంబరలో సోమవారం జరిగింది.వైసిపి మండల నాయకులు ఎం రంగు నాయుడు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎం శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ సింహాచలమమ్మ పాల్గొన్నారు.


పార్వతీపురం రూరల్: సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

సేవలను టీమ్ వర్క్‌గా అందించాలి

ప్రజాశక్తి- సీతంపేట

ప్రభుత్వ సేవలను ప్రజలకు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు టీం వర్క్‌గా అందించాలని ఆ సంస్థ డైరెక్టర్ జె మురళి పిలుపునిచ్చారు. మండలంలో సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు స్థానిక వైటిసిలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న రిఫ్రెషర్ కోర్సు శిక్షణ కార్యక్రమానికి ఆయన సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీమ్ వర్క్ హార్ట్ ఫుల్ నెస్, మేడిటేషన్, స్ట్రెస్ మేనేజ్ మెంట్ అంశాల పై విశ్లేషిస్తూ ప్రభుత్వ సేవలను ప్రజలకు ఒక టీం వర్క్ తో ఏ విధంగా అందించాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనరు కృష్ణ మోహన్, పాలకొండ డివిజనల్ డెవలప్మెంట్ అధికారి వివి గోపాలకృష్ణ, డివిజనల్ పంచాయతీ అధికారి రామ్ ప్రసాద్, ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ, ఎంపిడిఒ కె. గీతాంజలి, ఇఒపిఆర్‌డి కె. సత్యంతో పాటూ మాస్టర్ ఆఫ్ ట్రైనీస్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

కురుపాం : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేర్చే బాధ్యత సచివాలయం సిబ్బంది వాలంటర్లదేనని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సచివాలయ సిబ్బంది వాలంటర్లకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సచివాలయ సిబ్బందికి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అందిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్ బాబు, స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ జి. సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఈవో కె. చంద్రశేఖర్ సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు..

నూరు శాతం వ్యాక్సినేషన్ లక్ష్యం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రమాదకర వ్యాధుల నుండి పిల్లలకు రక్షణ కల్పించేందుకు శత శాతం వ్యాక్సినేషన్ లక్ష్యంగా మిషన్ ఇంద్ర ధనుష్ టీకా కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభమైందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. ఈ మేరకు ఆయన వీరఘట్టం - 2 సచివాలయంలో వైద్య సిబ్బంది నిర్వహించిన మిషన్ ఇంద్ర ధనుష్ టీకా కార్యక్రమాన్ని సోమవారం తనిఖీ చేశారు. నిర్దేశించిన మార్గదర్శకాలను టీకా కేంద్రంలో ఏ మేరకు అమలు చేస్తున్నారో పరిశీలించారు. పిల్లలకు టీకా వేస్తున్న తీరు, టీకా అర్హుల వివరాలు, పిల్లల వయస్సు రికార్డులో పరిశీలించారు. శనివారం వరకు కార్యక్రమం కొనసాగించాలని, పలు కారణాల వల్ల గతంలో టీకాలు వేసుకోకుండా మిగిలిన పిల్లలందరికీ టీకా పూర్తి చేయాలని, వివరాలన్నీ యూవిన్ పోర్టల్‌లో ఆన్లైన్ చేయాలని వైద్యాధికారిని, సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ పిల్లల్లో ప్రమాదకర వ్యాధుల బారి నుంచి కాపాడేందుకు పూర్తి స్థాయిలో టీకాలు తప్పనిసరి అని, వ్యాక్సిన్ వేసుకోకుండా మిగిలిపోయిన పిల్లలను గుర్తించి, అవసరమైన వ్యాక్సిన్లు వేసేందుకు ప్రభుత్వం మిషన్ ఇంద్ర ధనుష్ పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తుందని తెలిపారు. ప్రస్తుతం మూడో రౌండ్ జరుగుతుందన్నారు. వీరితో పాటుగా షెడ్యూలు ప్రకారం అర్హులైన పిల్లలు, గర్భిణీలకు ఈ కార్యక్రమం ద్వారా టీకా వేయనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏడాది లోపు పిల్లలు 849, 1 నుంచి ఐదేళ్ల లోపు పిల్లలు 423 మంది, గర్భిణీలు 282 మందికి మిషన్ ఇంద్ర ధనుష్‌లో టీకాలు వేస్తున్నామన్నారు. మొదటి, రెండవ రౌండ్ మిషన్ ఇంద్ర ధనుష్ టీకా కార్యక్రమాలు ఆగస్టు, సెప్టెంబరులో పూర్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, డెమో యోగీశ్వరరెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.


వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

టీకా కార్యక్రమం తనిఖీ

గరుగుబిల్లి: మండలంలోని సంతోషపురం, తోటపల్లి, నాగూరు గ్రామాల్లో మిషన్ ఇంద్ర ధనుష్ టీకా కార్యక్రమాన్ని జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీకా కేంద్రంలో వ్యాక్సిన్, అత్యవసర మందుల కిట్, హబ్ కట్టర్ పనితీరు, అర్హుల జాబితా వివరాలు, కార్యక్రమాన్ని సూచించే పోస్టర్లు పరిశీలించారు. ఏఏ టీకాలు వేశారు. ఆ పిల్లల వయస్సు రికార్డులో తనిఖీ చేశారు. అలాగే యూవిన్ పోర్టల్‌లో ఆన్లైన్ వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 16 వరకు మిషన్ ఇంద్ర ధనుష్ మూడవ రౌండ్ టీకా కార్యక్రమాన్ని కొనసాగించాలని, గతంలో ఏవైనా కారణాల వల్ల టీకా తప్పిన పిల్లలకు ఈ కార్యక్రమంలో పూర్తి చేయాలన్నారు. అలాగే తాత్కాలిక జీవనం, వలస జీవనం గడిపే వారిని ఆయా పరిధిలో గుర్తిస్తే అక్కడ పిల్లల్లో అర్హులుంటే టీకా వేయాలన్నారు. వివరాలన్నీ అదే రోజు యూవిన్ పోర్టల్‌లో ఆన్లైన్ చేయాలన్నారు. టీకా నిర్వహణ గురించి ముందు రోజునే అక్కడ ప్రజలకు తెలియజేయాలన్నారు. అనంతరం ఆయన అక్కడ వెల్నెస్ కేంద్రాల్లో మందులు, వైద్య పరికరాలు పరిశీలించారు. మాతా శిశు ఆరోగ్యంపై ఎక్కువ శ్రద్ధ కనబర్చాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎం.సన్యాసమ్మ, జయగౌడ్, ఎఎన్ఎంలు యశోద కుమారి, కళావతి, సోములమ్మ, ఎంఎల్ హెచ్ పి.శ్రావణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు..

చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఇటీవల కాలంలో పార్వతీపురం పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా నాయకులు బంటు దాసు సోమవారం గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావుకు వినతిపత్రం అందజేశారు. విశాఖ నుంచి రాయగడవైపు వెళ్లే భారీ వాహనాలు పారాది వద్ద వంతెన పాడవ్వడంతో పాలకొండ మీదుగా వయా పార్వతీపురం వైపు వాహనాలు రాకపోకలు సాగుతున్నందున ఈ 20రోజుల్లో నలుగురు మృతి చెందారన్నారు. అధికారులు దృష్టిసారించి భారీ వాహనాలను ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు సాయంత్రం 5.30గంటల నుంచి 8.30గంటల వరకు పట్టణంలోకి రానీయకుండా నిలిపివేయాలని కోరారు.

పరీక్ష నిర్వహణ పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి జరుగుతున్న ఎస్ వన్ పరీక్షలను ఎంఇఒ జి.సూరిదేవుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఇవి ఉపయోగపడతాయన్నారు. ఈ పరీక్షల్లో విద్యార్థులు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఇ.ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లోకేష్‌తో కలిసి నడుస్తున్న భూదేవి

పాదయాత్రకు సంఘీభావం

ప్రజాశక్తి - సీతంపేట

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు, నారా బ్రాహ్మణి, నందమూరి మోక్షజ్ఞ (బాలకృష్ణ తనయుడు) తుని నియోజకవర్గ ఇన్‌ఛార్జి యనమల దివ్య తదితరులతో కలిసి పాదయాత్రలో పాలకొండ నియోజకవర్గ టిడిపి నాయకులు పడాల భూదేవి పాల్గొని సంఘీభావం తెలిపారు. యువగళం పాదయాత్ర 3వేల కిలోమీటర్లు చేరుకున్న సందర్భంగా పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు బిడ్డిక జయలక్ష్మి, మాజీ కో-ఆప్షన్ సభ్యులు మూర మోహనరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు..

నిరసన తెలుపుతున్న బాధితులు, సిపిఎం నాయకులు ఈశ్వరరావు

విద్యుత్తు సౌకర్యం కల్పించాలని నిరసన

ప్రజాశక్తి- పాచిపెంట

మండలంలోని కొత్తకేసలిలో ఇళ్లు నిర్మించుకున్న పెద్ద గెడ్డ జలాశయం నిర్వాసితులకు విద్యుత్తు సౌకర్యం కల్పించాలని మాజీ ఎంపిటిసి సింహాచలం, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, నిర్వాసితుల సంఘం నాయకులు బి అభిమన్యుడు డిమాండ్ చేశారు. సోమవారం నిర్వాసితులతో కలిసి వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్తు సౌకర్యం కోసం ఎఇ కార్యాలయం చుట్టు ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడున్నర సంవత్సరాలుగా నిర్వాసితులమైన తాము ఇక్కడ ఇళ్లు నిర్మాణం చేపట్టి చీకట్లోనే మగ్గుతున్నా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద గడ్డ జలాశయం నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసి సాగునీరు అందించిన నిర్వాసితుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు మానుకొని తమకు వెంటనే కరెంటు సౌకర్యం కల్పించి ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం వేసిన స్తంభాలు మాత్రమే ఇక్కడ ఉన్నాయి తప్ప కరెంటు లేదని ఎద్దేవా చేశారు. ఇటువంటి ఏజెన్సీ ప్రాంతాలలో ఎలక్ట్రికల్ ఎఇ నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. వారం రోజుల్లో కరెంటు అందించకపోతే ఏఈ కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబాన్ని ఆదుకోండి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని సూడిగాంలో 15 ఏళ్ల నుంచి ఉపాధిహామీ చట్టం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసిన పాలూరు నారాయణరావు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్‌కు నారాయణరావు భార్య శాంతి, కుటుంబ సభ్యులు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా శాంతి మాట్లాడుతూ తన భర్త నారాయణరావు 15 ఏళ్ల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేసి అనారోగ్యంతో మరణించారని, తన మరణానంతరం ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం ఇవ్వాలని అధికారులకు విన్నవించుకోగా, మా గ్రామ పంచాయతీ పెద్దలు ప్రజలు ఏకగ్రీవంగా తీర్మానించారన్నారు. ఆ తీర్మాన కాపీని ఎంపిడిఒకి అందజేయగా, తనను ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమిస్తామని నమ్మబలికి రాజకీయ ఒత్తిళ్లకు లొంగి వేరే వారిని నియమిస్తున్నారని వాపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫీల్డ్ అసిస్టెంట్‌గా తనని నియమించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈమె పోరాటానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, నాయకులు జి.వెంకటరమణ, శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిరా, ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ నాయకుల హరినాథ్, రౌతు కైలాసం, సర్పంచ్ పైల సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ చంద్రమౌళి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబ సభ్యులు